క్లుప్తంగా

విద్యుత్ దీపాల ఏర్పాటు

భామిని: మండలంలోని బాలేరు పంచాయతీలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆదివారం విద్యుత్ బల్బులు వేశారు. పంచాయతీ కార్యదర్శి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి విశేష పూజలు

వీరఘట్టం: పట్టణంలోని కోటదుర్గ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

600 లీటర్ల బెల్లం ఊట పారబోత

సీతంపేట: మండలంలోని బుగడరాయి గ్రామ సమీపంలో ఆదివారం తనిఖీలు చేపట్టగా 600 లీటర్ల బెల్లం ఊట గుర్తించి పారబోశామని ఎస్సై అమ్మన్నరావు తెలిపారు. అలాగే 20 లీటర్ల సారా సీజ్ చేశామని చెప్పారు.

ప్రజా క్షేత్రంలో నిలదీస్తాం...



చిలకాం గ్రామంలో రీకాలింగ్ బాబు మేనిఫెస్టో పోస్టర్‌ను చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గరుగుబిల్లి: ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రజలను అవస్థలకు గురి చేస్తున్న చంద్రబాబును, కూటమి నాయకులను హామీలు అమలు చేసే వరకు ప్రజా క్షేత్రంలో నిలదీస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశానుసారం స్థానిక మాజీ ఉప ముఖ్యమంతి పాముల పుష్పశ్రీవాణి పిలుపు మేరకు మండలంలోని చిలకాం, దత్తివలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామాల్లో కూటమి ప్రజలకు చేసిన మోసాన్ని గడప గడపకు వెళ్లి వివరిస్తూ ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, నాయకులు తెర్లి ఎల్లం నాయుడు, పి.వెంకట దామోదరరావు, ఎం.గౌరినాయుడు, గుంట్రెడ్డి చంద్రశేఖరరావు, శశికుమార్, శ్రీనివాసరావులతో పాటు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులే స్పీడ్ బ్రేకర్లు



రాత్రి వేళల్లో రహదారికి అడ్డంగా నిలిచిన పశువులు

పార్వతీపురం రూరల్: పశువులు రహదారిపై సంచరిస్తూ రోడ్డుకు అడ్డంగా నిలిచి ఉండిపోవడంతో వాహన దారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో వేగంగా వెళ్తున్న వాహనాలకు ఎదురుగా వచ్చి పశువులు నిలిచిపోయి ఉండడంతో వాహన దారులు గమనించపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం ప్రధాన రహదారిపై నిత్యం ఇలా పశువులు మందల మందలుగా సంచరిస్తున్నప్పటికీ ఈ సమస్యకు సంబంధిత అధికారులు పరిష్కారం చూపడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు.

అందరికీ అందని అన్నదాత సుఖీభవ

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా అందాల్సిన ఆర్థిక సహాయంలో ఆర్టీజీఎస్ పేరుతో కోత విధించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఎస్.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి నాయకులు అందిస్తామని ప్రకటించారన్నారు. అయితే ఇప్పటికే ఎన్నికల (జూలై నెలలో) సంవత్సరం ఇవ్వగపోగా రెండవ ఖరీఫ్ సీజన్‌కు రైతుల బ్యాంక్ ఖతాల్లో రూ.20 వేలు వేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ కాలం సగం అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాల్సిన రూ.20 వేలు ఇంకా వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని ప్రకటించాయని ఎద్దేవా చేశార. ఈ నేపథ్యంలో తాజాగా పీఎం కిసాన్ పథకం ద్వారా మొదటి విడతగా కేంద్రప్రభుత్వం రూ.2 వేలు వంతున రైతులందరికీ బ్యాంక్ ఖాతాల్లో జమచేసిందని, రాష్ట్రప్రభుత్వం రైతాంగానికి ఇస్తామన్న రూ.5 వేలు చెల్లించాల్సిన అన్నదాత సుకీభవ పథకం కొంతమందికే బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని తెలియజేశారు. కొంతమందికి అన్నదాత సుఖీభవ పథకం పొందడానికి అన్ని అర్హతలున్నా ఆర్థిక సహాయం అందలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులందరినీ, కౌలు రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

ఇంకుడు గుంతలతో..

భూగర్భ జలాలు పెంపు



గతంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

భామిని: నీటిని సంరక్షించుకోకపోవడంతో నీటి ఎద్దడి పరిస్థితులు ఎదుర్కొంటున్నామని పర్యావరణవేత్తలు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలను పెంపొందించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది వర్షాలు తగ్గుముఖం పట్టాయి. అలాగే జిల్లాలో ప్రధాన నదులైన వంశధార, నాగావళిలో నీటి ప్రవాహం అంతంత మాత్రంగానే ఉంది. ఈ పరిస్థితుల్లో భూగర్భ జలాలు పెంపొందించుకునేందుకు అధికారులు ఇంకుడుగుంతల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.



భూమిలో నీరు ఇంకేందుకు ఏర్పాటు చేస్తున్న ఫారంపాండ్

వర్షపు నీటిని ఒడిసి పట్టుకుని భూమిలో ఇంకేటట్లు చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్ వాసులు ఇంటిపై నుంచి వచ్చే వర్షపు నీటిని పైపుల ద్వారా చిన్న సంపు లేదా ఇంకుడు గుంతల్లోకి మళ్లించాలి. ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పుడే సమీపంలో ఇంకుడు గుంత నిర్మించుకోవడం మేలని అధికారులు సూచిస్తున్నారు.

వాల్టా చట్టం ప్రకారం..

వాల్టా చట్టం ప్రకారం 200 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో చేపట్టే అన్ని నిర్మాణాల వద్ద వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉంది. ఆ తర్వాత ఆ విస్తీర్ణాన్ని 3000 చదరపు మీటర్లకు పెంచినా.. ఇంకుడు గుంతల నిర్మాణంలో మాత్రం ప్రజలు అలసత్వం వహిస్తున్నారు. పార్కులు, కాలనీల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల్లోకి వర్షపు నీటిని పంపించడం ద్వారా సమీపంలో ఉన్న బోరు బావుల నుంచి సంవత్సరం పొడవునా నీరు వస్తుంది. అలాగే బోర్ల వద్ద కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయాలపై అధికారులు ముమ్మర ప్రచారం చేపడుతున్నా.. ప్రజలు పూర్తిస్థాయిలో ముందుకు రావడం లేదు.

అవగాహన తప్పనిసరి..



నీటి సంరక్షణపై అవగాహన తప్పనిసరి. భూగర్భ జలాలను పెంపొందించుకుంటేనే భవిష్యత్ తరాలకు మనుగడ ఉంటుంది. సగటును కురిసే వర్షంలో 20 శాతం నీటిని సంరక్షించుకుంటే భవిష్యత్‌లో ఇంటి అవసరాలు తీరుతాయి.

డాక్టర్ జీ.ఎస్.నాయుడు, జియాలజీ లెక్చరర్, భామిని

ఉపాధి పథకం ద్వారా నిర్మాణం..



ఉపాధి పథకంలో భాగంగా ఫారంపాండ్స్ పేరిట భారీ గుంతలు నిర్మిస్తున్నాం. రైతుల భూముల్లో వీటిని ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాలు పెంపొందడంతో పాటు పంటలకు సాగునీరు అందుతుంది.

జి.శ్రీహరి, ఏపీడీ, ఎన్ఆర్ఈజీఎస్, పాలకొండ

● రేకుల షెడ్డే గతి..



సీతంపేట మండలంలోని ఎత్తైన కొండ శిఖరంపై ఉన్న పొంజాడ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నేటికీ రేకుల షెడ్డులోనే నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రస్తుతం 30 మంది విద్యార్థులు చదువుతుండగా.. ఉపాధ్యాయులు అందరికీ ఒకే దగ్గర పాఠాలు చెబుతున్నారు. అదనపు భవనాలు మంజూరు చేయాలని గ్రామస్తులు చెబుతున్నారు.

– సీతంపేట

సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు

వీరఘట్టం: పట్టణంలో వినాయక చవితి ఉత్సవాల సందడి ప్రారంభమైంది. ఈ నెల 27 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటినుంచే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయాలకు వినాయక విగ్రహాలను సిద్ధం చేశారు. విజయనగరం, రాజమండ్రి, తదితర ప్రాంతాల నుంచి స్థానిక వ్యాపారులు పెద్ద పెద్ద విగ్రహాలు తీసుకువచ్చారు. ఒక్కో విగ్రహం రూ. పది వేల నుంచి 35 వేల రూపాయల వరకు పలుకుతోంది.



గ్రోమోర్ సెంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు

పాములకు ఆవాసం

వీరఘట్టం: గతంలో వీరఘట్టం మండలంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ను పాలకొండకు తరలించారు. దీంతో అంతవరకు విధులు నిర్వహించిన ఐసీడీఎస్ కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. చుట్టుపక్కల పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో పాములకు ఆవాసంగా మారింది. ఇదిలా ఉంటే ఈ భవనం పక్కనే ఎంఈఓ కార్యాలయం ఉండడంతో అప్పుడప్పుడు పాములు కనిపిస్తుండడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఈ ఖాళీ భవనానికి మరమ్మతులు చేపట్టి ఎంఈఓ కార్యాలయానికి అప్పగిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



నిరుపయోగంగా మారిన ఐసీడీఎస్ కార్యాలయ భవనం

పిచ్చి మొక్కలు తొలగించరూ..

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీలోని వడ్డివీధి జంక్షన్‌లో ప్రధాన రహదారి పక్కనున్న ఖాళీ స్థలంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో విషసర్పాలకు ఆవాసంగా మారాయని.. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



గృహాల మధ్య ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు

ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు

- నోండ్రుకోనలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీలో మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి



నోండ్రుకోనలో నిర్వహించిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్‌ను చూపుతున్న పాముల పుష్పశ్రీవాణి తదితరులు

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీ వాణి విమర్శించారు. మండలంలోని చినగీసాడ పంచాయతీ నోంద్రుకోన గ్రామంలో ఆదివారం మండల అధ్యక్షుడు కుంబురుక దీనమయ్య ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ వివరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు ఇంకా ఎలాంటి మేలు చేయగలమోనని ఆలోచించి మరిన్ని పథకాలను తూచా తప్పకుండా అమలు చేశారని గుర్తు చేశారు. చిత్తశుద్ధి అంటే అలా ఉండాలని, కేవలం అధికారమే పరమావధిగా అమలు సాధ్యం కానీ హామీలిచ్చి.. నేడు అమలు చేయలేమని చేతులెత్తేయడం జనాన్ని మోసం చేయడమేనన్నారు. నాడు జగనన్న మరిన్ని పథకాలతో ప్రజలకు మరింత మంచి ఎలా చేయాలా అని ఆలోచిస్తే.. నేడు సీఎం చంద్రబాబు మాత్రం హామీలను ఎలా ఎగ్గొట్టాలా అని ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలలో ఆడబిడ్డ నిధి అంటూ ఇంట్లో ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తామని, ఉద్యోగాలు పొందని యువతీ, యువకులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పారని, ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడానికి ఏడాదిన్నర పట్టిందని పేర్కొన్నారు. అదీ కూడా పూర్తి స్థాయిలో ఏ పథకం ఇవ్వడం లేదని అర్హులకు చాలా వరకు పథకాలు అందడం లేదన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌తో ప్రచురించిన పత్రాలను చూపుతూ బాబు మోసాలను ఎలా తెలుసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, పార్టీ వివిధ విభాగాల నాయకులు గోరిశెట్టి గిరిబాబు, నిమ్మక గోపాల్, మాజీ ఎంపీటీసీ కె.రాజేష్, సర్పంచ్‌లు కె.కళావతి, బి.గౌరీశంకరరావు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏకలవ్య పీఈటీని సస్పెండ్ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల పీఈటీని సస్పెండ్ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులను అక్కడి పీఈటీ ఇటీవల దారుణంగా కొట్టారని ఆరోపించారు. జరిగిన సంఘటనపై అధికారులు విచారణ చేపట్టి వాస్తవమేనని నిర్ధారించారని పేర్కొన్నారు. కానీ నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సురేష్ పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

వీరఘట్టం:

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ జె.సౌజన్య సూచించారు. మండలంలోని కుంబిడి – ఇచ్ఛాపురం గ్రామ పంచాయతీలో ఆదివారం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని గిరిజన రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయన్నారు. చీడపీడలను జీవామృతం, ఘనామృతంలతో నివారించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బిడ్డిక గౌరునాయుడు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

వీరఘట్టం: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఎస్సై జి. కళాధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కొత్తబస్టాండ్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. డ్రైవర్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనుమానితులపై దృష్టి

పాలకొండ రూరల్: జనావాసాల మధ్య తిరుగాడే అనుమానిత వ్యక్తులపై ప్రజలు దృష్టి సారించాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. పట్టణంలో గారమ్మ కాలనీ, నీలమ్మ కాలనీతో పాటు మురళీమోహన్‌నగర్, వెంకటరాయుని కోనేరు, వీరఘట్టం రహదారి పరిసరాల్లో ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా వాహన తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని వారికి అపరాధ రుసుం విధించారు. ఈయన వెంట ఎస్సై ప్రయోగమూర్తి, సిబ్బంది ఉన్నారు.



ప్రజలకు సూచనలు చేస్తున్న సీఐ, ఎస్సై, తదితరులు

బోరు ఏర్పాటు



బోరు వేయిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద ఆదివారం బోరు తీశారు. నీటి కోసం సిబ్బంది ఎన్నో ఇబ్బందులు పడేవారు. దీంతో 15వ ఆర్థిక సంఘ నిధులతో జియాలజిస్ట్ దుర్గాప్రసాద్ సూచనలతో బోరు వేశారు. బోరు ఏర్పాటుతో నీటి సమస్య తీరిందని సిబ్బంది తెలిపారు.

స్మార్ట్ మీటర్లు వద్దని సీపీఎం ప్రచారం

సీతానగరం: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో (ఏపీఈపీడీసీఎల్) ఇళ్లలో అమర్చనున్న స్మార్ట్ మీటర్లు అమర్చనివ్వవద్దని సూచిస్తూ గ్రామాల్లో జరుగుతున్న ప్రచారం, అవగాహన సదస్సుల్లో ప్రజలు అవగా హన కల్పించు కోవాలని సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి ఈశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని అంటిపేట గ్రామంలో గల రచ్చబండ వద్ద విద్యుత్ వినియోగదారులతో సీపీఎం నాయకులు ఆదివా రం అవగాహన సదస్సు నిర్వహించారు.

మోసకారి చంద్రబాబును నమ్మొద్దు..

కొమరాడ:

అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన రావు ధ్వజమెత్తారు. మండలంలోని కంబవలస పంచాయతీ కంచరపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన హామీలను స్కాన్ చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన బాబు అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్ బాబు, కుమ్మరిగుంట మాజీ సర్పంచ్ పోలినాయుడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



కంచరపాడులో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న కన్వీనర్ జనార్దనరావు, వైస్ ఎంపీపీ శరత్‌బాబు

సరికొత్త వ్యాపారం..



టీడీపీ కూటమి దెబ్బకు ఎండీఎం వాహన డ్రైవర్లు, వలంటీర్లు రోడ్డున పడిన సంగతి తెలిసిందే. అయితే బత్తిలికి చెందిన ఎండీఎం నిర్వాహకుడు మిన్నారావు ప్రభుత్వం మోసం చేసినా బాధపడకుండా వాహనంలో సరికొత్త వ్యాపారానికి శ్రీకారం చుట్టాడు. వాహనంలో శానిటేషన్ పనులకు సంబంధించిన వస్తువులు వేసుకుని ఊరూరా తిరుగుతూ విక్రయిస్తున్నాడు. ప్రభుత్వం మా జీవితాలతో ఆడుకున్నా.. కుటుంబాన్ని పోషించుకోవడానికి వ్యాపారం చేస్తున్నానని సదరు వ్యక్తి తెలిపాడు.

– భామిని

ఎరువుకు ఎసరు – రైతుకు ఉసురు



వరినాట్లు వేస్తున్న మహిళలు

జియ్యమ్మ వలస రూరల్: ఇప్పటికే 70 శాతం వరి నాట్లు పూర్తి చేసుకున్న రైతాంగం తగినంత ఎరువు అందక పొరుగు జిల్లాల నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసి దమ్ము సమయంలో వేసుకుంటున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జియ్యమ్మవలస మండలంలో సుమారు 9200 మంది రైతులకు సంబంధించి అన్ని రకాల పంటలు కలిసి 9320 ఎకరాల సాగు భూమికి అవసరమైన ఎరువులను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాల్సి ఉంది. అయితే మండల వ్యవసాయ అధికారి 140 మెట్రిక్ టన్నుల డీఏపీ, 390 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. రైతులు మాత్రం చాలీ చాలని ఎరువును ఇచ్చారని ఆవేదన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్లో కొందామన్న అక్కడ స్టాక్ రాలేదని, ఎరువు దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. మరో పక్క ఒక లారీ యూరియా కావాలంటే 75 వేల రూపాయలు విలువ గల 15 కేసుల నానో యూరియా బాటిల్స్ తీసుకోవాలని సంబంధిత కంపెనీలు షరతు పెట్టడంతో ఎరువుల దుకాణదారులు డీఏపీ, యూరియా తేవడం లేదంటూ చెబుతు న్నారు. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సరిపడా విత్తనాలను, ఎరువులను ఇవ్వక ఉసూరు మనిపించారని రైతులు వాపోతున్నారు.

అందని సాగునీరు..



రుద్రిపేటలో మోటార్ల సహాయంతో నీటి తడులు అందిస్తున్న రైతులు

పాలకొండ రూరల్: మండలంలోని శివారు గ్రామాలకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు శివారు ప్రాంతాలైన వెలగవాడ, రుద్రిపేట, సిరికొండ, సీతంపేట రహదారిలో రైతులు వరి నాట్లు వేశారు. ఇదిలా ఉంటే ఇటీవల తోటపల్లి కాలువల ద్వారా అధికారులు నీరు విడిచిపెట్టారు. 17 రోజులవుతున్నా శివారు గ్రామాలకు నీరు అందకపోవడంతో నారు మడులకు నీటి తడులు అందించేందుకు ఇబ్బంది పడుతున్నారని అభ్యుదయ రైతు కండావు ప్రసాదరావు, ఎల్ఎల్ పురం సర్పంచ్ కుమార్ తెలిపారు. అధికారులు స్పందించి శివారు గ్రామాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.